క్లుప్తంగా

నేడు పలమనేరులో వైఎస్సార్ సీపీ నిరసన

పలమనేరు: కల్తీ మద్యం తాగి ఎంతోమంది ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వైఎస్సార్ సీపీ పలమనేరు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆరోపించారు. ఈ క్రమంలో వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పలమనేరులోని మార్కెట్ కమిటీ సమీపంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద సోమవారం ఉదయం 10 గంటలకు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపడుతున్నట్టు తెలిపారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

50 మందికి కంటి వైద్య పరీక్షలు


కంటి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

బైరెడ్డిపల్లె : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం చెన్నై శంకర నేత్రాలయ, మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మండలంలోని వివిధ గ్రామాల నుంచి 50 మందికి పైగా ప్రజలు వైద్య పరీక్షలు చేసుకున్నారు. వారిలో 25 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో వైద్యులు మురళీక్రిష్ణ, శ్రీనివాసులు, రమణ, గంగాధర తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కుప్పం : స్థానిక ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు కడా కార్యాలయ అధికారులు తెలిపారు. కడా పీడీ వికాస్ మర్మత్ నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని వెల్లడించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా ఆయుధ పూజ


ఆయుధ పూజలో పాల్గొన్న తపాల ఉద్యోగులు

కుప్పం: పట్టణంలోని ప్రధాన పోస్టాఫీసులో ఆదివారం ఆయుధ పూజను ఘనంగా నిర్వహించారు. కార్యాలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. తపాల ఉద్యోగులు, సిబ్బందికి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి పోస్టు మాస్టర్ విజయ్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీకి మహిళా శక్తి అవార్డు


మాజీ ఎంపీపీ క్రిష్ణవేణిని సత్కరిస్తున్న నిర్వాహకులు

బైరెడ్డిపల్లె : బైరెడ్డిపల్లెకు చెందిన మాజీ ఎంపీపీ క్రిష్ణవేణి మహిళా శక్తి అవార్డు అందుకున్నారు. తిరుపతి మహతీ ఆడిటోరియంలో ఆదివారం ఇండియన్ కల్చరల్ ఫెస్టివల్‌లో భాగంగా తిరుపతి వే ఫౌండేషన్ ప్రతినిధులు ఆమెకు అవార్డు ఇచ్చారు. ఆమె రాజకీయ, విద్య, సేవా రంగంలో చేసిన సేవలను గుర్తించి అవార్డుకు ఎంపిక చేసినట్టు వే ఫౌండేషన్ ప్రతినిధులు వెల్లడించారు. ఆమెను పలువురు అభినందించారు.

తులసీనాథంనాయుడికి సన్మానం


తులసీనాథం నాయుడిని సన్మానిస్తున్న సమాఖ్య ప్రతినిధులు

పలమనేరు: స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి నిర్వాహకుడు తులసీనాథం నాయుడిని ఆదివారం తిరుపతిలో విశ్రాంత ఐఏఎస్ అధికారి ముక్తేశ్వరరావు, గార్లపాటి దామోదర్‌నాయుడు, ఆముదాల మురళి ఘనంగా సన్మానించారు. విశ్వశ్రీ సాంస్కృతిక సమాఖ్య వార్షికోత్సవాన్ని రాస్ భవనంలో నిర్వహించారు. ఇందులో భాగంగా తెలుగు సాహిత్యానికి ఆయన చేస్తున్న సేవలను గుర్తించి సన్మానించినట్టు తెలిపారు.

24లోపు పంటలు నమోదు చేసుకోవాలి

పుంగనూరు : రైతులు తాము సాగు చేస్తున్న పంటల వివరాలను ఈ నెల 24లోపు ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలని ఏడీ శివకుమార్ తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ రైతులు తమ సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో డీసీఎస్ బుక్‌లో పంటల వివరాలను నమోదు చేయాలన్నారు. వారికి మాత్రమే పంట నష్ట పరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ, రాయితీతో వ్యవసాయ పరికరాలు, విత్తనాలు, ఎరువులు అందజేస్తామని తెలిపారు. ఆధార్, పాసుపుస్తకం, రికార్డులు తీసుకెళ్లాలని సూచించారు.

ఐదు గ్రామాలకు నిలిచిన రాకపోకలు


ఎక్స్‌ప్రెస్ హైవే వద్ద రోడ్డుపై నిలిచిన వరద నీరు

ఏదైనా రోడ్డు వస్తుందంటే స్థానికులు సంబరపడతారు. రవాణా సౌకర్యం మెరుగుపడి తమ ప్రాంతానికి అభివృద్ధి చెందుతుందని భావిస్తారు. తమ భూములకు మంచి ధరలు వస్తాయని, ఫ్యాక్టరీలు, వివిధ సంస్థలు వస్తే ఉద్యోగ అవకాశాలు పెరిగి జీవనం మారుతుందని సంతోషిస్తారు. పిల్లల భవిష్యత్తు బంగారుమయం అవుతుందని అనుకుంటారు. పలమనేరు నియోజకవర్గం గుండా వెళుతున్న ఎక్స్‌ప్రెస్ హైవే వల్ల ఐదు గ్రామాల ప్రజల భవిష్యత్తు అంధకారంలో పడింది. ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు దారి లేక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.


గొల్లపల్లి - మాదిగబండ గ్రామాల మధ్యలో ఎక్స్‌ప్రెస్ హైవే వద్ద చెరువులా మారిన వరదనీరు

- ఎక్స్‌ప్రెస్ హైవే పనుల్లో నిర్లక్ష్యమే కారణం
- అత్యవసర పరిస్థితుల్లోనూ బయటికి రాలేని పరిస్థితి
- పూడిపోయిన వాగులు, వంకలు
- నిరసనలు తెలిపినా పట్టించుకోని అధికారులు

పలమనేరు: దేశంలోని వివిధ మెట్రో నగరాలను కలుపుతూ కేంద్ర ప్రభుత్వం ఎక్స్‌ప్రెస్ హైవేలను నిర్మిస్తోంది. ఇందులో భాగంగా చెన్నై, బెంగళూరు నగరాలను కలుపుతూ చిత్తూరు, పలమనేరు నియోజకవర్గాల మీదుగా ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం చేపట్టారు. ఇది పూర్తయితే చెన్నై నుంచి బెంగళూరుకు మూడు గంటల్లోనే చేరుకోవచ్చు. ఈ రోడ్డు కొన్ని ముఖ్యమైన నగరాలను మాత్రమే అనుసంధానం చేస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణం పలమనేరు మండలంలోని కొలమాసనపల్లి పంచాయతీలో ఐదు గ్రామాల ప్రజలకు శాపంగా మారింది. కొలమాసనపల్లి పంచాయతీలోని గ్రామాలకు వెళ్లే రోడ్డు పైనే ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం చేపట్టారు. ఆయా గ్రామాల సమీపంలో అండర్ పాస్‌లు చేపట్టకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు దారి లేకుండా చేస్తోంది.

ప్రత్యామ్నాయ రోడ్డు లేదు

పలమనేరు-కుప్పం మెయిన్ రోడ్డు నుంచి మాదిగబండ గ్రామానికి ఇదొక్కటే రోడ్డు. మరో వైపు దొడ్డ డెయిరీ నుంచి చెన్నుపల్లి మీదుగా మాదిగబండకు వెళ్లేందుకు ఇదే రోడ్డు. గంగమాంబ సర్కిల్ వద్ద వాగు పక్కన దారి గుండా రాకపోకలు సాగించేవారు. ఎక్స్‌ప్రెస్ హైవే పనుల్లో వాగును మూసేయడంతో అక్కడ వరద నీరు చేరి రాకపోకలు లేకుండా పోయాయి. దీంతో దిగువమారుమూరు, పాలమాకులపల్లి, ఎరగుండేపల్లి, మాదిగబండకు రాకపోకలు స్తంభించాయి. ఈ గ్రామాల్లో దాదాపు 350లకు పైగా కుటుంబాలు వున్నాయి. ఇక్కడ ఎక్కువ మంది వ్యవసాయం, పాడిపరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. పాలను సేకరించే వాహనాలు కూడా రావడం లేదు. ఆ గ్రామాలకు మూడు వైపులా అడవి ఉంది. వున్న ఒక రోడ్డును మూసేయడంతో అత్యవసర పరిస్థితుల్లో పలమనేరు ఆస్పత్రికి ఎలా వెళ్లాలో తెలియక స్థానికులు తలలు పట్టుకుంటున్నారు. రైతులు పండించిన కూరగాయలను మార్కెట్‌కు తీసుకెళ్లేందుకు కూడా వీలు కావడం లేదు.

అధికారులకు చెప్పినా ఫలితం లేదు



“ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణ పనుల్లో ఇంజినీర్లు చేసిన తప్పిదానికి ఐదు గ్రామాల ప్రజలకు రాకపోకలు నిలిచిపోయాయి. వర్షాలు కురిసినప్పుడల్లా ఇదే సమస్య నెలకొంటోంది. ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారు చూసి వెళ్లడం తప్పా పరిష్కారం చూపడం లేదు.

– నరసింహారెడ్డి, ఉపసర్పంచ్, కొలమాసనపల్లి

రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు

బైరెడ్డిపల్లె : ఇటీవల కురుస్తున్న వర్షాలతో పాటు హంద్రీ-నీవా జలాలు పెద్దాపురం చెరువుకు వస్తున్నాయి. వరద నీరు రోడ్డు మీదుగా ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. ఉదయం విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడానికి, రైతులు సాగు చేసిన పంటలు మార్కెట్‌కు తరలించడానికి ఇబ్బందులు పడుతున్నామని పెద్దాపురం గ్రామస్తులు చెబుతున్నారు. వరద నీరు రోడ్డు మీదుగా రాకుండా నీటిని మళ్లించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


రహదారిపై నీరు ప్రవహిస్తుండడంతో ఆగిపోయిన కార్లు, ద్విచక్ర వాహనాలు

ధ్యానంతో ఏకాగ్రత, మానసిక ప్రశాంతత


ధ్యానం చేస్తున్న వృద్ధులు, విద్యార్థులు, యువకులు

రొంపిచెర్ల: ధ్యానంతో మనిషిలో ఏకాగ్రత పెరుగుతుందని బ్రహ్మర్షి పత్రీజీ పిరమిడ్ ధ్యాన క్షేత్రం సభ్యుడు నాగరాజ తెలిపారు. ఆయన ఆదివారం బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ పాతకురవపల్లె సమీపంలోని పిరమిడ్ ధ్యాన క్షేత్రంలో వృద్ధులు, విద్యార్థులకు ధ్యానంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ధ్యానం చేయడం వలన మనసు ప్రశాంతంగా వుంటుందని తెలిపారు. ఒత్తిడి, ఆందోళన తగ్గి, ఏదైనా విషయంపై స్పష్టత కలిగి వుంటారని తెలిపారు. రక్తపోటును నియంత్రించవచ్చని, రోగ నిరోధక శక్తిని పెంచుకోవచ్చని చెప్పారు. చెడు వ్యసనాల నుంచి దూరం కావొచ్చన్నారు. ప్రతి ఆదివారం ధ్యానం చేస్తామని, ఆసక్తి గల వారు ధ్యానంలో పాల్గొనవచ్చని వివరించారు. అనంతరం ధ్యాన క్షేత్రంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో సభ్యులు నరసింహులు, విజయకుమార్, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు


గాయపడిన వెంకటరమణ

రొంపిచెర్ల: బెంగళూరు-తిరుపతి జాతీయ రహదారిలోని రొంపిచెర్ల క్రాస్ వద్ద ఆదివారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ ఎండపల్లెవారిపల్లెకు చెందిన వెంకటరమణ (48) సొంత పని మీద రొంపిచెర్ల వచ్చాడు. ఆదివారం రాత్రి రోడ్డు దాటుతుండుగా గుర్తు తెలియని వాహనం వేగంగా వచ్చి ఢీకొంది. వెంకటరమణ రెండు కాళ్లు విరిగిపోయాయి. స్థానికులు అతన్ని 108లో పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. వెంకటరమణ భార్య వికలాంగురాలని, ప్రభుత్వం ఇచ్చే రూ.6000 పెన్షన్‌తో దంపతులు జీవనం సాగిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. ఇప్పుడు వెంకటరమణ రెండు కాళ్లు విరగడంతో వారికి దిక్కు ఎవరని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విరగకాసిన వేరుశనగ


వేరుశనగ కాయలను చూపుతున్న రైతు

రొంపిచెర్ల: మండలంలోని పెద్దగొట్టిగల్లు పంచాయతీ మేకలవారిపల్లెలో దోస పంటలో అంతర్ పంటగా వేసిన వేరుశనగ పంట విరగ కాసింది. చెట్టుకు 40 నుంచి 50 కాయలు వున్నాయి. గ్రామానికి చెందిన జనార్దన్ రెడ్డి గత ఏడాది ఎకరా పొలంలో దోస పంట సాగు చేశాడు. కాయలకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో పంటను అలాగే వదిలేశాడు. అందులోనే ఈ ఏడాది ఆగస్టులో వేరుశనగ విత్తనాలు నాటాలని నిర్ణయించాడు. మల్చింగ్ షీట్‌లోనే విత్తనాలను వేశాడు. ప్లాస్టిక్ కవర్ వుండడం వల్ల కలుపు తీసే పని లేకుండా పోయింది. ఈ క్రమంలో ఆదివారం కూలీలు చెట్లను పెరికారు. వేరుశనగ కాయలు బాగా కాయడంతో రైతు సంతోషం వ్యక్తం చేస్తున్నాడు. ఎకరా పొలంలో సుమారు 15 బస్తాల వరకు దిగుబడి వస్తుందని పేర్కొన్నాడు. కూలీలు, ఖర్చులు పోను సుమారు రూ.20 వేల వరకు ఆదాయం వస్తుందని వెల్లడించాడు.

దీపావళికైనా డీఏ బకాయిలు ఇవ్వండి సారూ!


మాట్లాడుతున్న గురురాజారావు

పలమనేరు: 'ఎన్నికల్లో ఓట్లు వేసి గెలిపించినందుకు బాగా బుద్ధి చెబుతున్నారు. పింఛనర్లకు పెండింగ్ డీఏలు ఇవ్వాలని పలుమార్లు కోరుతున్నా పట్టించుకోవడం లేదు. దీపావళి పండుగకైనా పెండింగ్‌లోని డీఏ బకాయిలను మంజూరు చేయండి' అని స్థానిక ఏపీ రిటైర్డ్ ఎంప్లాయీస్ ప్రెసిడెంట్ గురురాజారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఏపీ ఎన్జీవో కార్యాలయంలో ఆదివారం పింఛనర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 13 లక్షల మంది ఉపాధ్యాయ, ఉద్యోగ పింఛనర్లు వున్నారని తెలిపారు. వారిని ఇబ్బంది పెట్టేలా కూటమి ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందన్నారు. అధికారంలోకి వచ్చి 16 నెలలు గడుస్తున్నా పెండింగ్‌లో వున్న డీఏలను మంజూరు చేయకపోవడం దారుణమన్నారు. ఇప్పటికే ప్రభుత్వం రూ.30 వేల కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. ఉద్యోగ విమరణ చేసిన వారికి గ్రాట్యూటీ, లోన్ ఎన్‌క్యాష్‌మెంట్ చెల్లించకపోవడం బాధాకరమన్నారు. 2018 నుంచి రాష్ట్రంలో మరణించిన వేలాది మంది పింఛనర్ల వారసులకు బకాయిలు ఇవ్వాల్సి వుందని పేర్కొన్నారు. సమావేశంలో సంఘం నేతలు గౌస్, ఆర్ముగం, క్రిష్ణమూర్తి తదతరులు పాల్గొన్నారు.

ఆగని ఇసుక అక్రమ రవాణా

- రాత్రిళ్లు టిప్పర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలింపు
- పట్టించుకోని రెవెన్యూ, పోలీసు అధికారులు


చౌడేపల్లె మండలం చిన్నకొండామర్రి వద్ద ఇసుకను టిప్పర్‌లో లోడు చేస్తున్న జేసీబీ


రాత్రిళ్లు ఇసుకను తరలిస్తున్న టిప్పర్

చౌడేపల్లె : మండలంలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. కూటమి నేతలు టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నా రెవెన్యూ, పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చౌడేపల్లె, కందూరు మార్గమధ్యంలో వున్న అటవీ ప్రాంతంలోని వాగులు, వంకలతోపాటు కొత్త చెరువులో రహస్యంగా జేసీబీలతో ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. అక్కడి నుంచి ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా చౌడేపల్లె మండలం బోయకొండ రోడ్డులోని చిన్నకొండామర్రి సమీపంలో డంపు చేస్తున్నారు. తర్వాత ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత పెద్ద పెద్ద టిప్పర్లలో లోడ్ చేసి కర్ణాటకకు పంపిస్తున్నారు. ఇలా రోజుకు సుమారు పదికి పైగా టిప్పర్లు వెళుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. టిప్పర్ స్థాయిని బట్టి రూ.26 వేల నుంచి రూ.35 వేల వరకు విక్రయిస్తున్నారు. మండల పరిసర ప్రాంతాల్లో ట్రాక్టర్ల లోడు రూ.5 వేల నుంచి రూ.6 వేల చొప్పున విక్రయిస్తున్నారు. ఈ విషయం తెలిసినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్రమార్కుల నుంచి మామూళ్లు తీసుకుని మిన్నకుండిపోతున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానికంగా ఇసుక కృత్రిమ కొరతను సృష్టించడంతోపాటు మండలంలో ఇతర ప్రాంతాల నుంచి ఎవరూ ఇసుక సరఫరా చేయరాదని కూటమి నేత హుకుం జారీ చేశాడు. అతని మాటలు పట్టించుకోకుండా ఎవరైనా ఇసుకను తోలితే వారి వాహనాలను పోలీసులు, రెవెన్యూ అధికారులకు పట్టిస్తున్నారు. ఇసుకతోపాటు కొండలు, గుట్టలను తవ్వి గ్రావెల్, ఎర్రమట్టి, తెల్ల మొరుసును కొల్లగొడుతున్నారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ స్పందించి చౌడేపల్లెలో యథేచ్ఛగా సాగుతున్న ఇసుక, గ్రావెల్ అక్రమ దందాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై తహసీల్దార్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా స్పందించలేదు.

వృథాగా పోతున్న నీరు


ప్రాజెక్టు తూము నుంచి వృథాగా పోతున్న నీరు

- దెబ్బతిన్న బడబళ్లవంక ప్రాజెక్టు తూము
- మరమ్మతులకు రొంపిచెర్ల రైతుల అభ్యంతరం
- బ్యాక్ వాటర్‌తో భూములు మునుగుతున్నాయని వాదన
- నీటి వృథాతో పంటలకు ఇబ్బంది కలుగుతుందని పులిచెర్ల రైతుల ఆందోళన

రొంపిచెర్ల: రొంపిచెర్ల-పులిచెర్ల మండలాల సరిహద్దులో వున్న పెద్దగొట్టిగల్లు పంచాయతీ గాదిచెరువుపల్లె వద్ద రూ.34,57 కోట్లతో నిర్మించిన బడబళ్లవంక ప్రాజెక్టు తూము దెబ్బతినింది. దీంతో 22 రోజులుగా నీరు వృథాగా పోతోంది. ప్రాజెక్టు నిర్మాణంలో ముంపునకు గురైన భూములకు నష్ట పరిహారం ఇవ్వలేదన్న ఆగ్రహంతో గత నెల 20వ తేదీ రాత్రి ప్రాజెక్టు తూము బండను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఇరిగేషన్ అధికారులు పరిశీలించి వెళ్లిపోయారు. తూముకు మరమ్మతులు చేయాలన్న ఆలోచన కూడా చేయడం లేదు. నీరు వృథాగా పోకుండా ఇసుక బస్తాలు వేస్తామని తహసీల్దార్ అమర్‌నాథ్ చెప్పారు. ఇంతవరకు పట్టించుకోలేదు. ఇప్పటికే ప్రాజెక్టులోని నీరు 50 శాతం వెళ్లిపోయింది.

పరిహారం ఇచ్చాకే మరమ్మతులంటున్న బాధిత రైతులు

ప్రాజెక్టు నిర్మాణంలో ముంపునకు గురైన భూములకు పరిహారం ఇచ్చే వరకు తూముకు మరమ్మతులు చేయరాదని రొంపిచెర్ల మండలానికి చెందిన బాధిత రైతులు హుకుం జారీ చేశారు. వెంటనే మరమ్మతులు చేసి నీటి వృథాను అరికట్టాలని పులిచెర్ల మండలానికి చెందిన రైతులు కోరుతున్నారు. ఈ క్రమంలో అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకోలేక పోతున్నారు. ప్రాజెక్టు పనులు పూర్తి చేసి అప్పగించే వరకు వేచి చూసే ధోరణిలో అధికారులు ఉన్నారు.

రూ.10.68 కోట్లతో ప్రతిపాదనలు

బడబళ్లవంక ప్రాజెక్టు నిర్మాణంలో ముంపునకు గురైన 382 ఎకరాల భూములకు పరిహారం కోసం రూ.10.68 కోట్లు మంజూరు చేయాలని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. గత ప్రభుత్వం అంగీకరించింది. ఇంతలో ఎన్నికలు రావడం, అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం లేదు. కాంట్రాక్టర్‌కు కూడా బిల్లులు ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో 4000 ఎకరాలకు సాగు నీరు అందించాలనే ఉద్దేశంతో నిర్మించిన ప్రాజెక్టు ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల నిరుపయోగంగా మారుతోంది.



ఎగువ ప్రాంతం నుంచి కాలువ ద్వారా ప్రాజెక్టులోకి వస్తున్న నీరు, ప్రాజెక్టులో వున్న నీరు

రైతులు అభ్యంతరం చెప్పారు



నష్ట పరిహారం ఇచ్చే వరకు ప్రాజెక్టు తూముకు మరమ్మతులు చేయరాదని రొంపిచెర్ల మండల రైతులు అభ్యంతరం చెప్పారు. పులిచెర్ల మండలానికి చెందిన రైతులు మాత్రం తూము మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. ప్రాజెక్టు ముంపు భూములకు పరిహారం కోసం రూ.10.68 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. తూము దెబ్బతిన్న విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకునివెళ్లాం. ముంపు రైతులకు న్యాయం చేస్తాం.

– మునిశేఖర్, ఇరిగేషన్ ఏఈ

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం


సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

బైరెడ్డిపల్లె : బైరెడ్డిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1979–1980లో పదో తరగతి చదివిన వారు ఆదివారం హెచ్‌వీఎస్ కల్యాణ మండపంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భార్యాపిల్లలతో సంతోషంగా గడిపారు. చిన్నతనంలో పాఠశాలలో చేసిన అల్లరిని గుర్తు చేసుకున్నారు. స్నేహితుల యోగక్షేమాలు తెలుసుకున్నారు. గ్రామంలో ఉన్న సమయంలో అప్పుడప్పుడూ కలుస్తూ ఉండేవారమని, ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన స్నేహితులను 45 ఏళ్ల తర్వాత కలవడం సంతోషంగా వుందని పలువురు తెలిపారు. చదువుకున్న పాఠశాలకు తమ వంతు సాయం చేసేందుకు కృషి చేయాలని నిర్ణయించుకున్నారు.

వైఎస్సార్ సీపీ పంచాయతీ కమిటీల ఎంపిక



శాంతిపురం: మండలంలోని సొన్నేగానిపల్లి, ఎంకేపురంలో ఆదివారం వైఎస్సార్ సీపీ పంచాయతీ కమిటీలు, అనుబంధ సంఘాలను ఎన్నుకున్నారు. జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. సొన్నేగానిపల్లి పంచాయతీ అధ్యక్షుడిగా ఏ.మహేంద్రరెడ్డి, గౌరవాధ్యక్షులుగా అయ్యప్పరెడ్డి, రామప్ప, బూత్ కన్వీనర్లుగా కేశవరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, యువత అధ్యక్షుడిగా శ్రీనివాసులు, సోషల్ మీడియా కన్వీనర్‌గా గజేంద్ర ఎంపికయ్యారు. ఎంకేపురం పంచాయతీ అధ్యక్షుడిగా గజ్జల మోహన్, గౌరవాధ్యక్షులుగా ప్రభాకర్, బాబాసాహెబ్, సోషల్ మీడియా కన్వీనర్‌గా లోకనాథరెడ్డి, ఫైరోజ్, యువత అధ్యక్షుడిగా మోహన్‌రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్‌గా జయసూర్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రెస్కో మాజీ చైర్మన్ చక్రపాణిరెడ్డి, నియోకవర్గ బూత్ మేనేజర్ విజయకుమార్ కో కన్వీనర్లు ప్రభాకర్‌రెడ్డి, నాదమణి, నాయకులు అశ్వత్‌బాబు, రమేష్‌రెడ్డి, కిరణ్‌రెడ్డి, మురుగేష్, చలపతి, సురేష్, కృష్ణ, సంపంగి పాల్గొన్నారు.

పంట పొలాలపై ఏనుగుల దాడి



చిన్ననగిరి, దిగువమూర్తిపల్లెలో దెబ్బతిన్న టమాటా పంట, కొబ్బరి చెట్లు

పులిచెర్ల(కల్లూరు) : కొద్ది రోజులు మండలం వైపు రాని ఏనుగుల గుంపు మళ్లీ ప్రత్యక్షమైంది. ఆదివారం తెల్లవారుజామున దేవళంపేట పంచాయతీ కుమ్మరపల్లె, చిన్న నగరి, దిగువ మూర్తివారిపల్లె టమాటా, కొబ్బరి చెట్లు, వరి పంటలను తొక్కేశాయి. ఏనుగుల దాడులను నివారించి తమకు పరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

40 మందికి వైద్య పరీక్షలు

పుంగనూరు: పట్టణంలో ఆదివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వైద్యశిబిరంలో 40 మందికి వైద్య పరీక్షలు చేసినట్టు ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ శివ తెలిపారు. వారిలో 20 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేసినట్టు పేర్కొన్నారు. వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు రఘునాథరెడ్డి, వరదారెడ్డి, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.